వయసు వేడిలో ప్రేమలో పడిన కూతుర్ని ఆ తల్లి ఎలా మార్చింది?

శ్రీమతి ఎస్.హరిప్రియ కథ

# పరివర్తన

"రేఖా! ఎడ్యుకేషన్ సొసైటీ తరుపున ఎర్లీమార్నింగ్ హైదరాబాద్ వెళుతున్నాను. రెండురోజుల్లో వచ్చేస్తాను. ఇంటిపనులన్నీ గౌరికి హాండోవర్ చేశాను. నువ్వు కాలేజ్‌కి లీవ్ పెట్టి నేనొచ్చేంతవరకూ డాడీకి కావలసినవి చూడు" అంటూ ఆదేశించింది లెక్చరర్ రాఘవి. విధాత కొలతల ప్రకారం మలచి సృష్టించిన పాలరాతి బొమ్మలాంటి యువతి తనకూతురు రేఖతో. ఆ సమయంలో ఇద్దరూ డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని భోజన కార్యక్రమంలో ఉన్నారు. తల్లి ఆదేశం వింటూనే ఉలికి పడింది రేఖ. మునివేళ్లతో నాజూకుగా నోటికి అందించుకోబోతున్న నాలుగు మెతుకులు మధ్యలోనే ఆగిపోయాయి. అందంగా విచ్చుకున్న నోరు తెరచినట్లే ఉండిపోయింది. కాని... తల్లి తన కళ్లలోకే సూటిగా చూస్తూ తన మనోభావాల్ని అతి జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తూందని రేఖ తెలుసుకోలేదు. ఇప్పుడు తనే మాత్రం ఆవేశపడినా వ్యవహారం బెడిసికొట్టే ప్రమాదం ఉందని మాత్రం రేఖకు తెలుసు. అందుకే.

"ఇప్పుడు లీవ్ ఎలా కుదురుతుంది మమ్మీ? ఎగ్జామ్స్ దగ్గర కొస్తున్నాయిగా?!"

తనను తాను నిగ్రహించుకుంటూ నింపాదిగా జాగ్రత్తగానే అన్నది. తల్లి ఆజ్ఞాపించిందంటే తిరుగులేని శిలాశాసనమని తెలిసీ.

"ఇప్పుడెక్కడ ఎగ్జామ్స్? చాలా దూరమున్నాయి. ఐనా రెండురోజులేగా



ఫరవాలేదు'' అంటూ ఇక తన ప్రశ్నకు ఆస్కారమివ్వకుండా వాష్ బేసిన్ వైపు నడిచివెళ్లింది తనవే ఓరగా చూస్తూ.

రేఖ హతాశురాలైంది. ఉరకలు వేస్తున్న తన ఉత్సాహాన్ని బలమంతా ఉపయోగించి పిండేసినట్లయింది.

"మమ్మీ ఎప్పుడూ ఇంతే" తల్లిమీద పీకలవరకూ ఉక్రోషం పొంగుకొస్తూంటే

అదేమీ ప్రదర్శించ వీలులేని అసహాయతకు చిహ్నంగా రెండు కళ్లూ నీటి సరస్సులయ్యాయి. పిడికిళ్లు బిగుసుకున్నాయి.

ఇక భోజనం చెయ్యాలనిపించలేదు. ప్లేట్‌లోనే చెయ్యి కడిగేసుకుని విసురుగా తన రూంలోకెళ్లి బెడ్‌పై వాలింది. టెన్షన్‌తో ఫీలవుతూ అసహనంగా అటూ ఇటూ దొర్లుతూంది. రోషంతో గుండె ఎగసిపడుతూంది.

"రేపటిరోజున తనూ, శేఖర్ ప్లాన్‌చేసుకున్న పిక్నిక్ ప్రోగ్రాం కాన్సిల్ కావలసిందేనా?" ఆ విషయం తల్లితో ధైర్యంగా చెప్పే సాహసం చెయ్యలేకపోయింది.

తనతల్లి అమాయకురాలిలా, నాలుగుగోడల మధ్య పడి ఉండే సాధారణ గృహిణి అయినట్లయితే ఎలాగోలా మాటల్తో దుమ్మా కొట్టించి బలవంతంగానో నిర్బంధంగానో అలిగో, అల్లరిచేసో ఒప్పించి గెలవగలిగేదే. తల్లి అలాకాక అనుక్షణం బైట ప్రపంచాన్ని కూలంకషంగా చదువుతూ తన విద్యాకౌశలంతో ప్రతిభాపాటవాల్తో వేలమంది స్టూడెంట్స్‌ని విజ్ఞానవంతుల్ని చేస్తూ మనః స్థితుల్నీ మనస్తత్వాల్నీ స్టడీ చేసే మహామేధావి. తను ధైర్యం చేసి అడిగినా అనుమతించకపోగా ఒక జీవితానికి సరిపడే విజ్ఞాన గ్రంథాన్ని విప్పిచెప్తుంది. ఆధునిక ప్రపంచంలో నాగరికతా పరిసరాల్లో అభ్యుదయ భావాలమధ్య సంచరిస్తున్నా ఆమె అలవాట్లూ అభిరుచులూ, ఆచరణలూ, ఆచారాలు అన్నీ సంస్కారం, సంప్రదాయాల పేరిట బందీ ఔతుంటాయి.

ఈనాటి నవీన పోకడలు ఆడంబరం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఆమెతత్వానికి సరిపడవు. అలంకరణ, వస్త్రధారణ కూడా సంప్రదాయసిద్ధంగా ఉండాలంటుంది. నేటి యువతరం ఆడామగా అనే తేడాలేకుండా ఎంత ఫ్రీగా టీషర్ట్స్‌తో బెల్, న్యారీ, జీన్స్ ధరించటంలేదు? సరదా పడి ఎప్పుడైనా ముచ్చటపడి అడిగితే మెత్తగా వాత పెట్టినట్లు చాలా సౌమ్యంగా.

"రేఖా! ఇతరులను చూచి మనం అనుకరించకూడదమ్మా. అవి బావున్నాయని కాదు మనం చూడవలసింది. అవి మనకు బావుంటాయా లేదా అన్నది మనం ఆలోచించాలి. ఎవరినో మనం అనుకరిస్తే అసలు అందం మరుగున పడి వేషం వేసినట్లుంటుంది. అలంకరణ ఐనా, వస్త్రధారణ ఐనా సహజత్వం ఉట్టిపడేలా ఉండాలిగాని అనుకరించేదిగా ఉండకూడదు. వాటిని ధరిస్తే మనకు న ప్పుతాయా లేదా అనే అవగాహనతో ఎన్నికకు ముందుకు పోవాలిగాని వ్యామోహంతో కాకూడదు. మన కళ్లముందు కనిపించే ప్రపంచంలో సంప్రదాయసిద్ధమైన దుస్తుల అలంకరణలో ఉన్న వ్యక్తుల్నీ నాగరికతా వ్యామోహంతో నవీన పోకడలు పోతూ నవ్యత పేరుతో ఆధునిక వేషాల్తో ఉన్న వ్యక్తుల్నీ పరిశీలించి చూడు. ఎవరు మనకంటికి గౌరవప్రదంగా, పొందికగా, ముచ్చటగా కనిపిస్తారు? ఆ? మగవాడికి ఆడదుస్తులు వేస్తే ఎంత

ఏహ్యంగా, అసహ్యంగా, జుగుప్సాకరంగా ఉంటాడో ఆడది మగదుస్తులు ధరిస్తే కూడా అంతే అసహ్యంగా ఉంటుంది. ఆడదానిగా పుట్టినప్పుడే ప్రకృతి మనకు కొన్ని శాసనాలు విధించింది. ఆడది పవిత్రంగా భావించి గుప్తంగా దాచుకోవలసిన అవయవ సంపదను నాగరికత పేరుతో వంపుసొంపుల్ని అంగాంగ ప్రదర్శనతో బహిర్గతం చెయ్యకూడదు'' అంటూ మళ్లీ వాటిమీద ధ్యాసలేకుండా చేస్తుంది.


''ప్రతి చిన్న విషయానికీ ఉత్సాహం మీద నీళ్లు చల్లుతావు మమ్మీ'' అని ఎప్పుడైనా గునుస్తూ అంటే ''లేదమ్మా. నువ్వు నడవబోయే భవితవ్యపు బాటలో అవరోధాలు ఎదురై ఎదురుదెబ్బలు తగలకుండా పునాదిబాటలు వేస్తున్నాను. అతిసర్వత్రా వర్జయేత్ అన్నాయ్ శాస్త్రాలు'' నవ్వుతూ అంటూ కట్టిపడేస్తుంది. ఆ శాస్త్రాన్ని పాటిస్తున్నట్లే గుండెల్లో గంపెడు వాత్సల్యమున్నా పైకి మాత్రం పరిమితంగా గంభీరంగా ప్రవర్తిస్తుంది.

''ఉదయం ఎలాగైనా చెప్పి ఒప్పించే ప్రయత్నం చెయ్యాలి'' అనుకుంటూ ఖరీదైన రగ్గుని మీదికి లాక్కుంటూ విశాలమైన కనురెప్పల వాకిళ్లు బలవంతంగా మూసింది.

ఉదయం తను లేచేటప్పటికే తల్లి ప్రయాణమై ఉంది. తనిక చేసేదేమీలేక నిస్త్రాణగా రీడింగ్‌రూంలో కెళ్లి కూర్చుంది కణతలు నొక్కుకుంటూ.

''చూడమ్మా రేఖా! ఇది నా లైఫ్‌కి సంబంధించిన అతిముఖ్యమైన ఫైలు. నేను తిరిగి వచ్చేసరికి జాగ్రత్తగా చదివి తప్పులేమైనా ఉన్నాయేమో, డిక్టేట్ చేసిపెట్టు'' అంటూ వెనకగా వచ్చి తన ఆలోచనలను చెదరగొడుతూ ఫైలు చేతికిచ్చింది.

మనసు మొరాయిస్తున్నా అందుకోక తప్పలేదు. అయినా చివరి కొసమెరుపు ఆశగా.



''మమ్మీ!... ఇవాళ...'' అనబోయింది. అందుకు ఏ మాత్రం అవకాశమివ్వకుండా.

''చాలా కష్టపడి తయారుచేశాను. మనసుపెట్టి చదువు. ఇల్లు జాగ్రత్త' అంటూ—

''చెప్పవలసిందంతా రాత్రే చెప్పాను'' అన్నట్లు హుందాగా కదలిపోయింది...

తండ్రికి అన్నీ అమర్చి బైటికి పంపించాక మనసు భగ్గుమంటూంటే ముఖం కూడా వాష్ చేసుకోకుండా ఉక్రోషంతో ఉడికిపోతూ అలాగే వచ్చి రూంలో కూర్చుని ఫైలు ఓపెన్‌చేసింది.

విసుగ్గా ఫైల్లోకి చూపులు జొప్పించిన రేఖకు మొదటి వాక్యంగా.

''డియర్ చైల్డ్ రేఖా...'' అనే సంబోధన చదివి విభ్రాంతపోతూ తెల్లని కాగితాలమీద వరుసక్రమంలో గుండ్రంగా పేర్చినట్లున్న నీలి అక్షరాలవెంట చూపులు పరుగులెత్తించింది.

''డియర్ చైల్డ్ రేఖా! ఈ కాగితాల సమూహం మీద నేను ఎంతో ఓపిగ్గా పొందుపరచిన విషయాలను చివరివరకూ నువ్వూ అంతే ఓపిగ్గా అప్‌సెట్ అవకుండా జాగ్రత్తగా చదివి అర్థం చేసుకుంటావని నమ్ముతున్నాను. అందుకు తగిన వయసు కూడా నువ్వు చేరుకున్నావని విశ్వసిస్తున్నాను... ముందుగా... ఒక్కమాట!... అభిముఖంగా కూర్చుని ముఖంతా విపులీకరించలేని ఎన్నో మనోభిప్రాయాలు మనసు విప్పి ఈ కాగితాల ద్వారా క్లియర్‌గా విశదీకరించవచ్చు. అందుకే ఈ మార్గాన్ని ఎన్నుకున్నాను. నా ప్రయాణం కూడాఅందుకే. ఇక పాయింట్ కొస్తున్నాను...

ఈ రోజు నువ్వూ, శేఖర్... అదే... చాలా కొద్దిరోజుల క్రితం పరిచయమై బాయ్‌ఫ్రెండ్‌గా వ్యవహరిస్తూ ఉన్నాడే? అతను... మీ ఇద్దరివరకే ఏర్పాటు చేసుకున్న స్పెషల్ ప్రోగ్రాం.... పిక్నిక్‌కి వెళ్లవలసి ఉంది కదూ?...''

అంతవరకూ చదివిన రేఖ అదిరిపడి భయంతో బిగుసుకుపోయింది ఒక్కక్షణం.


తమాయించుకుని మళ్లీ చదవ నారంభించింది.

''... అంతకష్టపడి రహస్యంగా ఏర్పాటు చేసుకున్న ప్రోగ్రాం సంగతి మమ్మీకెలా తెలిసిందా అని ఆశ్చర్యపోతున్నావా? విద్యాపరంగానే కాకుండా ప్రతిష్టూడెంట్ మనఃప్రవృత్తుల్ని క్షుణ్ణంగా చదివే నాకు నా బిడ్డగా నిన్ను స్టడీ చెయ్యటం పెద్ద కష్టమేమీ కాదనుకుంటాను. ఆ సంగతి నీకూ తెలుసు...

మీరు ప్లాన్డ్‌గా నిర్ణయం తీసుకునేటప్పుడే తెలుసుకున్నాను. రేఖా! పెద్దల అభిరుచులు అభీష్టాలు తరాలు గడిచినా యువతరానికి అర్థం కాకపోవచ్చు కాని... బిడ్డలు అవివేకంతో వెయ్యబోతున్న తప్పటడుగులు గ్రహించటానికి కన్నవారికి సమయం అక్కర్లేదమ్మా. నాకున్న విద్యా పరిజ్ఞానం కంటే ఎక్కువగా ప్రపంచాన్ని క్షుణ్ణంగా చదివి నవ్యత నాగరికత పేరున నవీన పోకడాల తీరుతెన్నులు విశదంగా తెలుసుకున్నాను... కంగారు పడకు... శేఖర్‌తో ఫ్రెండ్షిప్ తప్పని నేనుగా

అనటంలేదు. లోకమంతా అపార్థంగా అనుకున్నా నేను నేను అనను కూడా. ఎందుకంటే... నేడు వెర్రితలలు వేస్తున్న నాగరికత వెంటే ప్రపంచమంతా పరుగులు తీస్తోంది కనుక. ముఖ్యంగా... ఆడదాని విషయంలో... "అరిటాకు ముల్లు మీద పడినా ముల్లు అరిటాకు మీద పడినా నష్టం అరిటాకుదే" అనేది పాత నీతి వాక్యం. ఇప్పుడు "ఎంతమాత్రం దుడుకు స్వభావంతో ఉన్నా చిట్లిపోయే పాళీలాంటిది నేటి ఆడదాని పరిస్థితి. అంతమాత్రాన పేనా మూలపడదు. మరో కొత్త పాళీ పేనాను అలంకరిస్తుంది. కాని... చిట్లిపోయిన పాళీ జీవితం?... అది మంచిదా కాదా అని నిన్నే ఆలోచించుకోమంటున్నాను. అదీ నీకు తల్లిగా అధికారయుతంగా హెచ్చరించటంలేదు. తల్లిగా హెచ్చరించవలసివస్తే నిన్ను దండించవలసే ఉంటుంది ఆ సర్కిల్ ఇద్దరం దాటిపోయాం. అందుకే ఒక హితురాలిగా స్నేహితురాలిగా సన్నిహితురాలిగా, శ్రేయోభిలాషిగా నీ భవిష్యత్‌ని నీ ముందుంచుతున్నాను... బాయ్‌ఫ్రెండ్స్ ఉండటం ఈ కాలపు నాగరికతా ప్రపంచంలో కల్చరనీ, కాకరకాయనీ మీ యువతరం చెప్పే కబుర్లకు నేను ప్రాధాన్యతనివ్వను. అంగీకరించను. కారణం... స్నేహాల్లో చాలా రకాలున్నాయి. ఆడైనా, మగైనా స్వచ్ఛమైన స్నేహం సుగంధ పరిమళాలు వెదజల్లేదిగా ఉండాలేగాని పెడత్రోవలు పట్టించి మురికి కూపంలోకి లాగి అగాధంలో పడవేసి జీవితాలను దెబ్బతీసేదిగా ఉండకూడదని నా గాఢాభిప్రాయం. అది ఒక ఆడా ఒక మగా స్నేహంతో సాధ్యం కాదని నా నమ్మకం. అందుకు ఉదాహరణగా ఈనాటి చాలామంది జీవితాలు. అందుకు మన కళ్లెదుటే పతనమైన ఒక లలిత, ఒక కిషోర్ ఒక ప్రమీల చాలు.

లలిత... చదువు నెపంతో ప్రకాశ్‌తో స్నేహం అంటూ ప్రారంభించి విచ్చలవిడి స్వేచ్ఛతో అతనివెంట కుక్కలా తిరిగి ప్రేమ, ప్రణయం అంటూ అతని మాటల ప్రలోభంలో పడి వంశగౌరవాన్నీ పరువు ప్రతిష్టల్నీ మట్టిలో కలిపి అతనితో వెళ్లిపోయింది. దాని కళ్లకు కమ్మిన వ్యామోహపు పొర కరిగి మైకం తొలగేటప్పటికి కుక్కలు చింపిన విస్తరిలా అయింది జీవితం. మోజు తీరిన ప్రకాష్ అంతటితో దాన్ని వదిలేసి వెళ్లిపోయి బుద్ధిగా తల్లిదండ్రులు కురుర్చిన సంబంధానికి తలవంచి లక్షల కట్నంతో పెళ్లి చేసుకుని సెటిలయ్యాడు. అది భరించలేని లలిత



### హెల్ప్

"నేను నిన్ను యిప్పుడు ముద్దు పెట్టుకున్నాననుకో. 'హెల్ప్ హెల్ప్' అని అరుస్తావా?" అడిగాడు రాము.

"అబ్బే దానికి హెల్ప్ ఎందుకు నేనొక్కదాన్నే ముద్దు పెట్టుకోగలను" చెప్పింది రాధ.

కె.సుజాత (భువనగిరి)

సంఘం వెలివేసి సమాజం విసిరేసి ఏదారీలేక దిక్కులేని దానిలా... ఆత్మాహుతి చేసుకున్న విషయం నీకూ తెలిసిందేగా?!

ఇక కిషోర్... అదే వ్యామోహంతో... పదిమందిని బ్రతికించటమే తప్ప తన జీవనోపాధి కోసం వెతుక్కోవలసిన అవసరం అగత్యంలేని కుటుంబంలో పుట్టి లక్షలాది ఆస్తినీ... ఒక్కగానొక్క కొడుకుగా ఆశలన్నీ అతని మీదే పెట్టుకుని కంటిపాపలా కాపాడుకుంటూ గుండెలమీద పెట్టుకుని అరిచేతుల్లో నడిపించుకుంటూ పెంచిన కన్నవాళ్ల గుండెలు పగలకొట్టుకుని రోదిస్తున్నా లెక్కచెయ్యకుండా వదిలేసి తిరిగి చూడకుండా... కాలు నేలమీద మోపే అవసరం లేకుండా కారుల్లో తిరగవలసిన అతను అజ్ఞానంతో బంగారు భవిష్యత్తుని కాలదన్ని... ప్రేమ, దోమ అంటూ దీపం పురుగులా డైజ్ ఆకర్షణలో పడి కాలినడకన ఆమె వెంటపడి ముళ్లబాటలో నడిచిపోయాడు... కామోద్రేకం తగ్గి కళ్లు తెరిచి వాస్తవాన్ని గ్రహించేసరికి జీవితం అతని చెయ్యి దాటిపోయింది. చేరదీసే దిక్కులేక వేరే గత్యంతరం లేక ఒకే గూటిలో కలిసి కాపురం చేస్తున్నట్లు నటిస్తూ ఒకరివలన ఒకరి జీవితం నాశనమైందని అంతరంగాలలో ద్వేషించుకుంటూ అంతఃకలహాలతో నిరంతర జీవన పోరాటంలో బ్రతుకుబండిని ఈడ్వలేక నిర్వీర్యుడై సతమతమౌతూంటే... కోర్కె కలిగినప్పుడల్లా కామం తీర్చుకోవటం తప్ప కాలే కడుపు నింపగల సమర్థుడు కాదని తెలుసుకుని అతన్నీ అతని వలపునీ నిర్దాక్షిణ్యంగా కాలదన్ని తనకు అన్ని విధాలుగా సంతృప్తి జీవితాన్ని చేకూర్చే వ్యక్తి తారసపడగానే డైజీ కళ్లాలు తెంచుకుని పరుగుతీసింది. ప్రేమ పిచ్చిలోపడి స్వతంత్రించి బ్రతకటం కూడా చేతకాని కిషోర్ పరోక్షంలో అగాధం సృష్టించి అందులోకి తోసేస్తూ సమక్షంలో సానుభూతి పేరిట సమాజ వ్యక్తులు విసిరే ముఖస్తుతి మాటల ఈటెల ధాటికి తట్టుకోలేక... మజ్నూలా... అర్థం చేసుకున్నావనుకుంటాను.

చివరగా ప్రమీల... కల్చర్ పేరుతో సరదాగా బాయ్‌ఫ్రెండ్స్‌తో లైఫ్‌లో కొంతభాగం ఎంజాయ్ చేసినా వివాహ బాధ్యత మాత్రం తల్లిదండ్రులకే వదిలింది. అంతవరకూ ఖుషీగా, కులాసాగా గడిచిన దాని జీవితం వివాహానంతరం పూర్వపు స్నేహాలు భర్తకు తెలిసి దాని పసిడి కాపురంలో నిప్పురవ్వలు రేగి, రగిలి విరిపాన్పులాంటి దాని సంసార జీవితం ఛిన్నాభిన్నమైంది. ఫలితం... గర్భవతిగా సూసైడ్ చేసుకుంది... నువ్వు సరైన అవగాహనతో ముఖ్యమైన పాయింట్లను అర్థం చేసుకోగలిగితే ఈ మాత్రం వివరణలు చాలనుకుంటాను. ఇవి ఉదాహరణలు మాత్రమే.

అభిమానం హద్దులు దాటితే స్నేహానికి దారి తీస్తుంది. స్నేహం అవధులు దాటితే మీ యువత భ్రమించే ప్రేమ... అది వివేకాన్ని గుడ్డిదాన్ని చేసి...

చాలామంది ప్రేమ వేరు పెళ్లి వేరు

అనే భావనతో రెండుగా విభజిస్తూ ఇల్లాలు— ప్రియురాలు, మొగుడూ ప్రియుడు అంటూ ధర్మసందేహాలు వెలిబుచ్చుతుంటారు. నా దృష్టిలో మాత్రం ప్రేమ, పెళ్లి రెండు విభాగాలుగా ఉండకూడదని ప్రేమైనా పెళ్లైనా, దృష్టి మనసూ, బుద్ధి ఒకే వ్యక్తిపై కేంద్రీకరించినప్పుడే అది నిజమైన ప్రేమకు తార్కాణం. ఆడైనా, మగైనా వాళ్లే నిజమైన ప్రేమికులు. మనసొకరికి అంకితం చేసి తనువు ఒకరికి అర్పించి మనసులేని మనుగడ సాగించటం మనసులో ఒకరిని ప్రతిష్టించుకుని ఆరాధిస్తూ మనిషిగా మరొకరితో కర్తవ్యం నెరవేర్చుకోవటం బాధ్యతగల ప్రేమ అనిపించుకోదు. వ్యభిచారమనిపించుకుంటుంది. గత జ్ఞాపకాలు మనసులో శాశ్వత ముద్రపడి భావి జీవితాన్ని కాల్చేస్తాయి. తాత్కాలిక ప్రలోభానికి లొంగి క్షణికాకర్షణకు లోనై అదే ప్రేమ, ప్రణయం అంటే నేను సమర్థించను. మనసు, హృదయం వేరువేరుగా ఉండకూడదు. రెండూ ఒక్కటిగా ఏకమై భాసిల్లాలి. అదే పరిపూర్ణత చెందిన ప్రేమ. జీవితపు ఒడిదుడుకుల సోపానాలన్నీ అధిరోహించి చివరివరకూ కలసి బతుకుతూ పైమెట్టు చేరుకోగలిగి ఉండి పెళ్లాడగలిగే దమ్ముంటేనే ప్రేమించాలి. అలా ప్రేమించగలిగితేనే పెళ్లాడాలి.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే... ఒకవేళ నీవిషయంలో అదే జరిగితేభవిష్యత్తులో తగలబోయే ఎదురుదెబ్బల్ని కళ్లకు కట్టినట్లు చూపించి ఎదుర్కోబోయే అవరోధాల్ని విపులీకరించి నిశితంగా ఆలోచించుకోటానికి టైమిస్తున్నాను. నా ధోరణి చాదస్తంలా, ఛాందసంలా అనిపిస్తోంది కదూ? అది అత్యంత సహజం. ఎందుకంటే ఇప్పుడు నీలో ప్రవహించేది మంచిచెడుల విచక్షణా జ్ఞానం తెలియని ఉరకలు వేసే వేడిరక్తం, కళ్లాలులేని గుర్రంలా పరుగులు తీసే వయసు కుప్పిగంతులు వేసే మనసు. భవిష్యత్ జీవితాన్ని టెక్నికలర్‌తో కాకుండా బ్లాక్ అండ్ వైట్‌లో చూడు. అది

## ఆవుశక్తి



చలికాలంలో అనేక దేశాలలో ఎన్నో శక్తినిధులు కరిగిపోతాయి. ప్రతిఇంట్లోనూ రెండుమూడు ఎలక్ట్రిక్ హీటర్లు ఖచ్చితంగా ఉంటూనే వుంటాయి. అయితే అలాంటి వారికో శుభవార్త. మీ దొడ్లో ఆవుల్ని పెంచుకుంటే మీకికనుండి ఇల్లు వెచ్చగా అవటానికి ఏమాత్రం విద్యుత్‌ను వాడనవసరం లేదు. పశ్చిమ జర్మనీకి చెందిన విద్యుత్ కేంద్ర అధికార్లు చెప్తున్నదాన్నిబట్టి ప్రతి ఆవు కనీసం 1200 వాట్లవేడిని తన శరీరం నుండి విడుదల చేస్తుందట. ఆ వేడిని మనం హీట్ పంప్ ద్వారా ఇంట్లోకి ప్రసరించేలా వెయ్యవచ్చు. ఉదాహరణకు ఇరవై ఆవులు విడుదల చేసే వేడితో సంవత్సరానికి 3,300 లీటర్ల ఇంధనం ఆదా అవుతుందట. ఇదేదో బాగుంది కదూ అసలే ఇది చలికాలం!

జూపిటర్

వెలిసిపోయేదో కలిసిపోయేదో స్పష్టమౌ తుంది. అన్నా, చెల్లి కలిసి తిరిగినా గాసిప్స్ లేవదీసి ప్రచారం చేసే ప్రబుద్ధులున్న ఈ రోజుల్లో నువ్వు శేఖర్‌తో స్నేహం అంటూ ముందుకు పోవటం పిక్నిక్‌లంటూ బయలుదేరటం హర్షింపదగినదీ కాదు. క్షేమకరం అసలే కాదు. టీనేజర్స్‌తో కలిగేది పరస్పరాకర్షణేగాని పరిపూర్ణ ప్రేరణ కాదు. అది తెలుసుకునేలోగా లైఫ్ చేజారిపోతుంది. కాంతికి భ్రమసి మంటల్లోపడి శలభాల్లా మాడిపోకముందే అది మాడ్చి మసి చేసే వెలుగు అని గ్రహిస్తే బ్రతుకు పూలబాట ఔతుంది. నువ్వు తప్పు చేస్తున్నావనీ చెయ్యబోతున్నావనీ నిందమోపటంలేదు. నువ్వు ముందుకు వెయ్యబోతున్న తప్పటడుగు తప్పటడుగు ఔతుందేమోనని భయపడుతున్నాను. ఈ రోజు జరుగుతున్నది మంచే ఐనా రేపు జరగబోయేది చెడు కావచ్చుగా?!

అభిమానం... స్నేహం... ప్రేమ... పరాజయం... పతనం... వరుస క్రమంలో జీవితాలను దెబ్బతీస్తాయి తప్ప జరిగిపోయిన తరువాత పశ్చాత్తాప పడేకంటే ముందుగానే మనసును అదుపులో పెట్టుకుని వశం తప్పకుండా నిగ్రహించుకోవటం చాలా వివేకమైన పనికదూ? జరగకూడని అనర్థానికి మనమే అవకాశమిచ్చి జరిగిపోయాక భగవంతుడనీ విధి అనీ సమాధానపడటం అవివేకం. ఎందుకంటే... విభిన్న మనస్తత్వాలు గల ప్రత్యర్థుల్లాంటి ఇద్దరు విరోధులు ఒకే దైవాన్ని భక్తితో కొలిచి ఒకరి పతనాన్ని మరొకరు కోరుకున్నారనుకో. అప్పుడు ఆ దైవం పరిస్థితి సందిగ్ధావస్థే కదా? అందుకే మానవ పరీక్షలకు తట్టుకోలేని ఆ భగవంతుడు శిలారూపం దాల్చి మౌనం వహించాడేమో! అలా మారటానే భగవంతుడయ్యాడేమో! ఒకరు పరాజయం పొందితేగాని ఒకరు పరిపూర్ణులుకారు. ఒకరు పతనమైతే గాని మరొకరు విజేత కాలేరు. ప్రేమ కూడా అంతే. నిన్న స్నేహం, ఇవాళ పిక్నిక్, రేపు సినిమా ఆ తరువాతో?

అందుకే నువ్వు అనాలోచితంగా ముందుకు వెయ్యబోతున్న తప్పటడగును తప్పటడుగు కాకుండా ఆసరా ఇచ్చి స్టడీగా నిలబెట్టాలనే సదుద్దేశంతో వెనకనుండి వెన్ను తడుతున్నారు. రేఖా! తెలిసీ పదిసార్లు తప్పు చెయ్యనక్కర్లేదు. తెలియకుండా చేసే ఒక్కపొరపాటు చాలు జీవితం పతనం కావటానికీ బ్రతుకు బండలు కావటానికీ ఆధునికం అభ్యుదయం నాగరికత అంటూ వెర్రిమొర్రి వేషాలు వెయ్యటానికీ హద్దులు దాటిన విచ్చలవిడి స్నేహాలతో స్వేచ్ఛా విహారం చేస్తూ సమాజాన్ని ధిక్కరించి నిర్లక్ష్యంగా బతకటానికీ మనం పాశ్చాత్యులం కాదు. భారతీయ పడతులుగా మనకు కొన్ని కట్టుబాట్లు సంప్రదాయాలు ఉన్నాయి. ప్రకృతిపరంగా కూడా మనకు కొన్ని నియమ నిబంధనలు వుండాలి. ఉండితీరాలి. వాటికి కట్టుబడి ఉంటేనే సొసైటీలో ఆడదానికి గౌరవం, రక్షణ, విలువ. ఆ హద్దులు అతిక్రమించి జీవితాన్ని విలాసంగా భావించిన తరువాతనే కదా స్త్రీకి అవి కరువైనాయి? నిప్పు మనల్ని ఆకర్షించినా అది

తగిలినంతమేరా దగ్ధం చేస్తుందనే భయం మనకుంటే దాని జోలికే పోలేం. ఒకవేళ అదే మనల్ని చేరుకోవాలని ప్రయత్నించినా మనల్ని చేరేలోగా అదే ఆరిపోతుంది... నేను చెప్పాలనుకున్నదంతా విపులంగా వివరించాను. ఇక నువ్వు తీసుకోవలసిన జాగ్రత్తలు పాటించవలసిన మంచిచెడ్డలు తీసుకోబోయే నిర్ణయం మీదనే ఆధారపడి ఉన్నాయి. నా ఈ ప్రయత్నంలో నీ ఒక్కదాని భవిష్యత్ మార్గం సుగమం కాగలిగితే ఎందరో అమాయక యువతుల అభాగ్య జీవితాలను తీర్చిదిద్దినంత తృప్తిపడతాను. చీకటి మార్గాన్ని ఎన్నుకోబోయే ఎందరో ఆడపిల్లలకు వెలుగుబాట చూపినంత ఆనందపడతాను. తుది నిర్ణయం నీ ఇష్టానికే వదలివేస్తున్నాను'' అంటూ ముగించింది.

అప్పటికి రేఖ ఐదడుగుల సుకుమార శరీరం చిరుచెమటలు పట్టి సన్నగా కంపించటం మొదలు పెట్టింది. జరిగినదంతా మననం చేసుకుంది.

''మమ్మీ అంచనా కరెక్టే అయితే శేఖరం తనకు కలిగిన అభిమానం, స్నేహం హద్దులు దాటి గుడ్డిగా ప్రేమ అనే అగ్నివైపు దారి తీస్తూందా? శేఖర్ తనను ప్రలోభ పెట్టి లొంగదీసే ప్రయత్నం చేస్తున్నాడా? తనను అజ్ఞానాంధకారంతో కళ్లు మూసుకుని ఊబిలోకి దిగబోతూందా?''

ఎడతెగని ఆలోచనలతో సతమతవౌతుండగా బోయ్ డైలీ న్యూస్ పేపర్లందించి వెళ్లాడు.

మనసును మళ్లించటానికి ఫైలు పక్కన పెట్టి యథాలాపంగా పేపరు మడత విప్పింది. హెడ్ లైన్స్‌తో సహా పేపర్‌నిండా రేప్‌లు అత్యాచారాలు, అఘాయిత్యాలు, అమానుషాలు, ఆత్మహత్యలు...

ప్రతిరోజూ వింటూ చదువుతూన్నవే ఐనా ఈ రోజెందుకో భయంకరంగా భయానకంగా అనిపిస్తున్నాయి. గుండె ఒక్కొక్క వార్తకు ఒక్కొక్క రకంగా ఎగిరిపడుతూంది. ఆ వార్తల్లో సంఘటనలన్నీ స్వీయానుభవానికి వచ్చినట్లు హిస్టీరిక్‌గా ఫీలవుతూంది.

మైకంలో పడి కొట్టుకుంటున్న తన అవివేకాన్ని పారద్రోలి వివేకాన్ని మేల్కొల్పి జ్ఞాననేత్రాన్ని తెరిపించింది అమ్మ. లేకపోతే తన భవితవ్యం? ఆమె తనకు తల్లే కాదు జీవిత పాఠశాలలో మహా మహోపాధ్యాయిని.

''ఇకనుండీ మమ్మీ చెప్పినట్లు విని ఆమె చూపిన మార్గంలో నిశ్చింతంగా నిర్భీతిగా నిర్భయంగా సాగిపోవాలని నిశ్చయించుకుంది. ఇప్పుడు రేఖ మనసెంతో తేలికపడి హాయిగా తృప్తిగా గుండెలనిండా గాలిపీల్చుకుని తిరుగులేని దృఢ సంకల్పంతో ఫైలు తెరచి పెన్నందుకుని చివరగా.

''మమ్మీ! నువ్విచ్చిన ఫైల్లో దిద్దవలసిన తప్పులేమీ నాకు కనిపించలేదమ్మా'' అని రాసి ఫైలు మూసేసి హుషారుగా తల్లి గదిలోకి వెళ్లి ఫైలు టేబుల్ మీద పెట్టింది.